క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

తలకొండపల్లి: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ నిర్మాణం పూర్తయింది. శుక్రవారం జెడ్పీటీసీ ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభం, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, పోస్టర్‌ను జెడ్పీటీసీతో కలిసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, యాదయ్య, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న వేదపండితులు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారం లలిత భువనేశ్వరి సమేత చంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. వేలాది భక్తజనం సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. ఆలయంలో అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లను ప్రతిష్ఠింప చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఉత్సవంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, బీఆర్‌ఎస్ నాయకుడు క్యామ మల్లేశ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యే పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గీత, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు



జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న అంజయ్య

యాచారం: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపల్లిలో జరిగిన మేడే ఉత్సవాల్లో ఉపాధి కూలీలతో కలిసి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించి, ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. కూలీలకు నిత్యం రూ.500 కూలి ఇవ్వాలని, ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, జంగయ్య, నారాయణ, సైదులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన గోదా లక్ష్మమ్మకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.24 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. నరేందర్‌గౌడ్, దస్తగిరి, చంద్రమౌళి, పర్వతాలు, బాలకుమార్‌గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

నూతన వధువుకు పెళ్లికానుక



పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన నూతన వధువు శివానికి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యంలు పెళ్లి కానుకగా రూ.10,116 అందజేశారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైనప్పటి నుంచి సర్పంచ్ దంపతులు గ్రామంలో వివాహం చేసుకున్న ఆడబిడ్డలకు పెళ్లికానుకగా ఆర్థిక సాయం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, స్థానిక నాయకులు రమేశ్, పర్వతాలు, యాదయ్య, జంగయ్య, నర్సింహ, గణేశ్, వెంకటయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియా మాయాజాలం

మైనింగ్ దొంగలు రెచ్చిపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా పచ్చని పంట పొలాల మాటున క్వారీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. నేతలకు డబ్బు ఎరచూపి మాయాజాలం చేస్తూ.. క్రషర్ల ఏర్పాటుకు తహతహలాడుతున్నారు.

- స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు సన్నాహాలు
- వ్యతిరేకిస్తున్న ప్రజలు
- పంట పొలాలు నాశనం చేయొద్దంటున్న రైతులు
- నేతలను బుజ్జగిస్తున్న వ్యాపారులు



మొండిగౌరెల్లిలో కొండెంగల గుట్టపై క్వారీ ఏర్పాటుకు సన్నాహాలు

యాచారం: మైనింగ్ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. గ్రామాలకు గ్రామాలే స్టోన్ క్రషర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా.. మొండిగా క్వారీల నిర్వహణకు మొగ్గు చూపడంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి ఏపీలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం యాచారం గ్రామ రెవెన్యూ పరిధిలోని 105, 121, 126, 132, 146, 200 తదితర సర్వే నంబర్లలోని సుమారు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూముల్లోని గుట్టల్లో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు ఈ ప్రాంతాన్ని మైనింగ్ జోన్‌గా గుర్తించింది. జోన్ ఏర్పాటుతో ప్రముఖ కంపెనీలు యాచారం గ్రామ రెవెన్యూ పరిధిలో స్టోన్ క్రషర్లు, క్వారీల ఏర్పాటుకు 40కి పైగా అర్జీలు పెట్టుకున్నాయి. అయినప్పటికీ.. స్థానికుల వ్యతిరేకతతో గ్రామ పంచాయతీలో ఎన్‌ఓసీ ఇవ్వలేదు. దీంతో సంబంధిత అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పటికీ.. ముక్తకంఠంతో వ్యతిరేకించారు. దీంతో వారు వెనక్కుతగ్గారు. స్థలాలు ఇవ్వలేం అంటూ అర్జీ దారులకు అధికారులు చెప్పారు.

మొండిగౌరెల్లిలో..

మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబరు 19లోని 14 ఎకరాల్లో ఓ వ్యాపారి స్టోన్ క్రషర్, క్వారీ ఏర్పాటు చేయడానికి మూడేళ్లుగా విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఒకరిద్దరి నేతలతో చేతులు కలిపి క్వారీ నిర్మించేందుకు యత్నిస్తున్నారు. గ్రామంలోని రైతులు తమకున్న కొద్ది స్థలాల్లో కూరగాయలు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. స్టోన్ క్రషర్, క్వారీలు ఏర్పాటు చేస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని రైతులు భయాందోళన చెందుతున్నారు.

మా బతుకులు ఆగమైతయ్..



మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబరు 19 పక్కనే తన వ్యవసాయ పొలం ఉంది. పుదీనా తదితర ఆకుకూరలు సాగు చేసి మార్కెట్లో విక్రయించి జీవనోపాధి పొందుతాను. పొలం పక్కనే స్టోన్ క్రషర్, క్వారీ ఏర్పాటు చేస్తున్నారని తెలిసి కంటిమీద కునుకులేకుండా పోయింది. క్వారీ వస్తే పంటపొలాలు దెబ్బతినడంతో పాటు.. మా బతుకులు ఆగమైపోతాయి. పచ్చటి పొలాలను నాశనం చేయొద్దు.

– గుర్రం చెన్నారెడ్డి, రైతు, మొండిగౌరెల్లి

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



మైనింగ్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లు, క్వారీలు ఏర్పాటు చేయాలని చూస్తే బాధ్యులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లోంచి రోడ్డు మార్గాలు నిర్మిస్తే వాహనాల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. మొండిగౌరెల్లిలో క్వారీల ఏర్పాటుకు రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తున్నారని తెలిసి.. పనులు నిలిపి వేయించాం. మళ్లీ పనులు చేస్తే కేసులు పెడతాం.

– సుచరిత, తహసీల్దార్, యాచారం

క్వారీ పెట్టనిచ్చేది లేదు

- వ్యాపారులను తిప్పికొట్టండి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: మొండిగౌరెల్లిలో స్టోన్ క్రషర్, క్వారీలను పెట్టనిచ్చేది లేదని, ఆశతో వ్యాపారులు డబ్బులు వృథా చేసుకోవద్దని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సర్వే నంబరు 19లో ఓ వ్యాపారి స్టోన్ క్రషర్, క్వారీ ఏర్పాటుకు కొంత మంది స్థానికుల సహకారంతో ఏర్పాట్లు చేస్తుండగా.. రైతులు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఆందోళన చెందవద్దని, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో దాదాపు 680 ఎకరాల్లో ఇప్పటికే మైనింగ్ జోన్ ఏర్పాటు చేశాం.. ఇంకా ఏ మండలంలో కొత్తగా స్టోన్ క్రషర్లు, క్వారీలు పెట్టనిచ్చేది లేదని స్పష్టం చేశారు. స్థానికంగా కొంతమంది ప్రోత్సాహం వల్లే వ్యాపారుల్లో ఆశ పెరిగిందని, వారెవరో నాకు తెలుసునని ఎమ్మెల్యే చెప్పారు. క్వారీలు ఏర్పాటు చేయడానికి వస్తే.. ఐక్యంగా ఉంటూ.. వ్యాపారులను తిప్పి కొట్టండని సూచించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ ఇక్కడి రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, స్టోన్ క్రషర్లు, క్వారీలు రానివ్వొద్దని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు యాదగిరి, రవి, సోమశేఖర్, వెంకటేశ్, నర్సింహ, మల్లేశ్, హర్షవర్ధన్, నర్సింహ ఉన్నారు.



ఎమ్మెల్యే మంచిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నేడు జాబ్‌మేళా

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఈనెల 6న ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడానికి వివిధ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఈ మేళా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన యువత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సర్వసభ్య సమావేశం నేడు

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుర్మిద్దలో శాంతిహోమం

యాచారం: కుర్మిద్దలో శుక్రవారం శాంతిహోమం ఘనంగా నిర్వహించారు. పూరాతన సత్యనారాయణస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించనున్న నేపథ్యంలో ఆ భవనం కూల్చి వేతకు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా పూజారి రాజేశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో శాంతిహోమం చేసి, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాన్ని కూల్చి వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటివెలుగు'

ఆమనగల్లు: విఠాయిపల్లి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం డా.పరిక్షిత్ నరేందర్, మంజులదేవిల ఆధ్వర్యంలో 181 మందికి కంటి పరీక్ష చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత, ఆసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



కడ్తాల్: సమ్మెకు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నేతలు

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీపీఎస్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లిలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి, పరిష్కరించాలని కోరారు. మండల కేంద్రంలో జేపీఎస్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. టీపీఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావిద్, జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, రాంచందర్‌నాయక్, యాదయ్యగౌడ్, యాదయ్య, కృష్ణ, జేపీఎస్ నాయకులు శివకుమార్, మరళీమోహన్, వాజిద్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: సమస్యలు పరిష్కరించాలంటూ జేపీఎస్‌లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరవధిక చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ తమను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



యాచారం: ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ సుకన్య తదితరులు

తలకొండపల్లి: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం.. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. శుక్రవారం చుక్కాపూర్‌లో సర్పంచ్ కిష్టమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ మావిళ్లపల్లి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. ఏగ్రేడ్ ధాన్యం ధర రూ.2,060, బిగ్రేడ్‌కు ధర రూ.2,040 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, జీరానాయక్, శ్రీను, మల్లేశ్, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, జంగయ్య, రవి, శ్రీనాథ్, భరత్, లావణ్య, సత్తిరెడ్డి, అశోక్‌రెడ్డి, భీష్మాచారి, కర్ణాకర్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల పట్ల చిన్నచూపు తగదు

యాచారం: ధాన్యం విక్రయించే రైతుల పట్ల నిర్వాహకులు చిన్నచూపు చూడవద్దని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. చింతపట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కేంద్రాల్లో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, చింతపట్ల సర్పంచ్ సరిత, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, ఐకేపీ ఏపీఎం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: జిల్లా సహకార మార్కెట్ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, మండల రైతు సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశ్, కిరణప్ప, శ్రీనివాస్‌గుప్తా, రాములు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వినోద ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణలో నిరుద్యోగ సమస్య తీరుతుందని, వెనుకబడ్డ ఈ ప్రాంత ప్రజలు బాగుపడుతారని సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని తెలిపారు. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగించిందని, ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు.

ప్రియాంక సభను సక్సెస్ చేయాలి

నిరుద్యోగుల సమస్యపై ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ప్రియాంక గాంధీ బహిరంగసభకు, నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు సంజీవ, నేతలు శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త మృతి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త పప్పు కృష్ణమూర్తి(85) శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. 1,400 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న ఆలయానికి కృష్ణమూర్తి ధర్మకర్తగా ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఇబ్రహీంపట్నం రూరల్: వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి అనుబంధ గ్రామం మన్నెగూడలో భూమిపూజ చేశారు. సర్పంచ్ అండాలు, ఎంపీటీసీ మంగ చేతుల మీదుగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నిర్వాహకుడు యాదిరెడ్డి, గ్రామ పెద్దలు రవీందర్‌రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం పోచారం గ్రామంలో కన్నుల పండువగా జరిగింది. గ్రామంలోని పురాతన దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వేడుకలు నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విచ్చేసి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్‌లు కవిత, అరుణ, గీత తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై ధరల భారం



పాదయాత్ర చేస్తున్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర ప్రభుత్వ విధానాల వలన దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే రాములు ఆరోపించారు. ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా బీజేపీ కో హఠావో దేశ్‌కో బచావో పోరుబాట పాదయాత్రను ఆయన తుర్కయంజాల్ చౌరస్తాలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు సామాన్యులకు పెను భారంగా మారాయన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ దేశంలోని బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అలీమొద్దీన్, యాదయ్య, కాటం రాజు, సుందరమ్మ, విజయ, అనురాధ, చిట్టీ భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

కడ్తాల్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏక్వాయిపల్లిలో సర్పంచ్ సుగుణతో కలిసి కంటివెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమావతి, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలు విద్యార్థులకు మేలు



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కడ్తాల్: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయని, వాటి వలన విజ్ఞానం, వికాసం, ప్రశాంతత లభిస్తుందని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ శిక్షణ శిబిరాలు తోడ్పతాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, సలహాదారు తిరుపతిగౌడ్, అకాడమీ ఇన్‌చార్జిలు సాగదేవత, స్వాతి తదితరులు ఉన్నారు.

సమ్మర్ స్టడీ క్యాంపు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాన భవన్‌లో స్థానిక ఉపాధ్యాయులు నీళ్ల పద్మగిరి, అనిల్, ప్రతాప్‌ల సహకారంతో ఉచిత స్టడీ సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. క్యాంపు ఏర్పాటుకు అంబేడ్కర్ సంఘం నాయకులు మహేందర్, అర్జున్, చంటి, రాజు సహకారం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్, పట్టణ పెద్దలు రవీందర్‌రావు, దాసు, మాజీ సర్పంచ్ శేఖర్, పెంటయ్య, నారాయణ, ప్రవీణ్, మహేందర్, లక్ష్మణ్, అమర్, మధు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ క్యాంపును ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గీత కార్మిక సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: గీత కార్మికులకు ప్రభుత్వం రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించడం, కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి కార్మిక సంఘం నేతలు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మహేశ్‌గౌడ్, రాములు, యాదయ్య, లక్ష్మయ్యగౌడ్, నర్సింహ్మగౌడ్, మధుసూదన్‌గౌడ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభకు తరలిరావాలి

అబ్దుల్లాపూర్‌మెట్: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గం కార్యదర్శి యాంజాల ప్రహ్లాద్ పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. కావున నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు.